క్లుప్తంగా

లక్ష్యాలను చేరుకోవాలి



ఖిలా వరంగల్: విద్యార్థులు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ సూచించారు. కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మాధవి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిజజీవితంలో సమస్యలను ఎలా అధిగమించాలి, లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని ఎలా సాధించుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంభమేళాకు వెళ్లిన వినయ్‌భాస్కర్ దంపతులు



హన్మకొండ: మహా కుంభమేళాకు బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు తరలివెళ్లారు. ఈమేరకు ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్ వద్ద గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానమాచరించి, ప్రత్యేక పూజలు చేశారు.

6కిలోల మిశ్రమ వెండి ప్రతిమ బహూకరణ



మడికొండ: 6కిలోల 250 గ్రాముల మిశ్రమ వెండితో తయారు చేసిన స్వామివారి విగ్రహాన్ని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆ విగ్రహానికి అర్చకులు ప్రత్యేక అభిషేకం చేసి అలంకరణ చేశారు. కార్యక్రమంలో దాతలు అడ్డగూడూరి సత్యనారాయణ దంపతులు, శశిధర్ దంపతులు, శ్రీనివాస్ దంపతులు, సుధాకర్ దంపతులు, ప్రవీణ్‌రెడ్డి దంపతులు, సతీష్‌కుమార్ దంపతులు, నాగరాజు దంపతులు, సుధీర్‌రెడ్డి దంపతులు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, రొడ్డ దయాకర్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పరామర్శ



హసన్‌పర్తి: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత అరూరి రమేష్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల అరూరి రమేష్ తల్లి వెంకటమ్మ మృతి చెందారు. ఈమేరకు ప్రశాంత్ నగర్‌లోని అరూరి రమేష్ ఇంటికి మంత్రి సంజయ్ వెళ్లి ఓదార్చారు. మంత్రి వెంట పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, పార్టీ హనుమకొండ మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జక్కు రమేష్ ఉన్నారు.

ప్రయాణం నరకప్రాయం

ధర్మసాగర్: మండలంలోని రాపాకపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలతో గుబులు పుట్టిస్తోంది. రాపాకపల్లి గ్రామం గతంలో ధర్మసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండేది. 6 సంవత్సరాల క్రితం నూతన జిల్లాలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటులో భాగంగా రాపాకపల్లి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు అయింది. ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సు సౌకర్యానికి మోక్షం లభించడం లేదు. ఇటీవల ధర్మసాగర్ నుంచి వయా వడ్డెగూడెం, రాపాకపల్లి మీదుగా దేవునూర్ గ్రామం వరకు 7 కిలో మీటర్లు బీటీ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు కాగా, సంబంధిత కాంట్రాక్టర్ ధర్మసాగర్ శివారు నుంచి రాపాకపల్లి వరకు రోడ్డు వేయకుండానే చేతులెత్తేశాడు. అయితే ధర్మసాగర్ మండల కేంద్రంలో వివిధ పనులు నిమిత్తం రాపాకపల్లి ప్రజలు ఉనికిచర్ల మీదుగా రవాణా కొనసాగిస్తుండేవారు. ప్రస్తుతం ఆ రోడ్డు కూడా పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ రోడ్డుకు ఇరువైపులా ఉనికిచర్ల, రాపాకపల్లి గ్రామస్తులకు చెందిన వ్యవసాయ భూములు కూడా ఉంటాయి. ఆ గ్రామానికి కనీసం ఆటో సౌకర్యం కూడా లేకపోవడంతో నగరానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ధర్మసాగర్ నుంచి వడ్డెగూడెం, రాపాకపల్లి గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్లు మాత్రమే ఉండగా, ఆ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఉనికిచర్ల గ్రామం మీదుగా 8 కిలో మీటర్ల దూరం నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మానసిక దృఢత్వంపై అవగాహన

- ప్రతీ శనివారం ఒక్కో మండలంలో విద్యార్థులకు స్ఫూర్తి కార్యక్రమం



స్ఫూర్తి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ (ఫైల్)



హాజరైన విద్యార్థులు (ఫైల్)

వరంగల్: రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో మానసిక దృఢత్వం, జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు వరంగల్ కలెక్టర్ సత్యశారద ఆలోచన మేరకు 'స్ఫూర్తి' కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ప్రతి శనివారం ఒక మండలంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈనెల 8న ఖానాపురం మండలంలోని 14 ప్రభుత్వ వసతిగృహాలు, 15న రాయపర్తి మండలంలోని 15 ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో 6 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 22న వరంగల్, ఖిలా వరంగల్ మండలాల్లోని 45 ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చేపట్టారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ (గుడిబడి) పాఠశాలలో కలెక్టర్ సత్యశారద పాల్గొని స్ఫూర్తి కార్యక్రమం కోసం రూపొందించిన షార్ట్ ఫిలింను విద్యార్థులతో కలిసి తిలకించారు.

10 అంశాలపై అవగాహన

యునెస్కో, యూనిసెఫ్, ప్రపంచ ఆరోగ్యసంస్థ బాలబాలికల్లో జీవన నైపుణ్యాల అభివృద్ధి కోసం 10 అంశాలను రూపొందించింది. అందులో స్వీయ అవగాహన నైపుణ్యాలు (స్వీయ జాగృతి), సమానుభూతి (సహానుభూతి), సమస్య పరిష్కార నైపుణ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, ప్రతిభాపూర్వక భావవ్యక్తీకరణ (భావప్రసార) నైపుణ్యం, విమర్శనాత్మక ఆలోచన నైపుణ్యం, సృజనాత్మక ఆలోచనా నైపుణ్యం, పరస్పర వ్యక్తిగత సంబంధాల నైపుణ్యం, ఒత్తిడి నియంత్రణా నైపుణ్యం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. కోపం, ఈర్ష్య, రాగ ద్వేషాలు, స్వార్థం, పగ తదితర విషయాలపై దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. జిల్లా అధికారులు, అపార అనుభవం కలిగిన విశ్రాంత ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై వివరిస్తున్నారు.

ప్రపంచాన్ని శాసించే స్థాయిలో..



వచ్చే 15 ఏళ్లలో ప్రపంచాన్ని శాసించే స్థాయిలో భారత యువత నిలుస్తుందని నా ఆశాభావం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి నూతన ఆవిష్కరణలు చేయాలి. మొబైల్ ఫోన్లు, సాంకేతికతను (టెక్నాలజీ) అవసరం మేరకే వినియోగించుకోవాలి. అధికంగా వాడితే బానిసగా మారి తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. విద్యార్థులు ఒత్తిడిని జయించి సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు స్ఫూర్తి కార్యక్రమం దోహదపడుతుంది. - సత్యశారద, కలెక్టర్

బీజేపీకి బీఆర్ఎస్ పరోక్ష మద్దతు

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస రావు

న్యూశాయంపేట: రాష్ట్రంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయకుండా మతోన్మాదులకు సహకరిస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులకు బీఆర్ఎస్ పరోక్షంగా సహకరిస్తూ వారి గెలుపునకు కృషి చేస్తోందని ఆరోపించారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన జిల్లా సమితి సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి కమ్యూనిస్టులు సహకరిస్తున్నారని, కమ్యూనిస్టులపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అక్కసు వెళ్లగక్కుతున్నారని అన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే కమ్యూనిస్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత కేసీఆర్‌కు లేదన్నారు. సమావేశానికి జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మంచాల రమాదేవి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, మునిగాల భిక్షపతి, బాషబోయిన సంతోష్, రాజుగౌడ్, బత్తిని సదానందం, కొట్టెపాక రవి, శ్యాంసుందర్ రెడ్డి, రాసమల్ల దీన, కండె నరసయ్య, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న ఆకతాయిలు

- గంజాయి, మద్యం మత్తులో యువత
- పగలు, రాత్రి రాతికోటలో సంచారం



మధ్యకోటలోని నిర్మానుష్య ప్రాంతం

ఖిలా వరంగల్: మధ్యకోటలో మద్యం, గంజాయి మత్తులో యువత రెచ్చిపోతోంది. నిర్జన ప్రదేశాలు, మట్టి, రాతికోటలపై ఆకతాయిలు తిష్టవేసి అటుగా వచ్చే పర్యాటకులను బెదిరిస్తున్నారు. మత్తు పదార్థాలకు బానిసలై అసలేం చేస్తున్నామనే విచక్షణ లేకుండా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిర్మానుష్య ప్రాంతాల్లో ఒంటరిగా నడిచి వెళ్లేవారిని బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ప్రేమికులు అటువైపు వెళ్తే వారి వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్‌తోపాటు ఆభరణాలను ఇవ్వాలని దాడులకు పాల్పడుతున్నారు. ఇలాంటి ఘటన శనివారం సాయంత్రం జరిగింది. రాతికోట మెట్ల మార్గంలో నడిచి వెళ్తున్న స్థానిక రైతుపై గంజాయి మత్తులో ఆకతాయిలు అకారణంగా దాడి చేశారు. అప్రమత్తమైన తోటి రైతులు నిందితులను వెంబడించి ఇద్దరిని పట్టుకుని మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించినట్లు తెలిసింది.

మహిళా క్రికెట్ పోటీలు నిర్వహించండి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దిలీప్

- యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దిలీప్

హసన్‌పర్తి: పురుషులకే కాకుండా మహిళా క్రికెట్ పోటీలు కూడా నిర్వహించాలని యువజన కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దిలీప్ కోరారు. మండల కేంద్రంలో మాస్టర్స్ ప్రీమియం లీగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ పోటీల్లో గెలుపోటములు సహజమన్నారు. ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపునకు ప్రయత్నించాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కోడెల మురళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు కనపర్తి కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, దేవస్థాన మాజీ చైర్మన్ రవి, మాజీ సర్పంచ్ పుల్లా రవి, మాజీ ఉపసర్పంచ్ సాయిని రామరాజు, శ్రీనివాస్, నిర్వాహకులు శశికాంత్, వల్లాల యుగంధర్, సంపత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఖిలా వరంగల్: వరంగల్ భట్టుపెల్లి రహదారిపై అమ్మవారిపేట క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం ఐనవోలు మండలం కొండపర్తి గ్రామానికి చెందిన రాజు, పరశురాములు సమీప బంధువులు కాగా, ఆదివారం ఉదయం కాజీపేటలో జరిగిన ఓ ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి బయల్దేరారు. ఈక్రమంలో భట్టుపల్లి రహదారిపై అమ్మవారిపేట క్రాస్ రోడ్డ వద్దకు చేరుకోగానే గుర్తు తెలియని వాహనం వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో ఆ ఇద్దరు రోడ్డుపై పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఎంజీఎంకు స్థానికులు తరలించారు.

పురస్కారం అందుకున్న అరుణకీర్తి



అరుణకీర్తి పతాక రెడ్డికి పురస్కారం అందించి సన్మానిస్తున్న నిర్వాహకులు

హన్మకొండ అర్బన్: ఉదయ సాహితీ, తెలంగాణ (సాహిత్య వికాస వేదిక) ఆధ్వర్యంలో ఖమ్మంలోని బోడెపూడి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల కవుల రాష్ట్ర సర్వసభ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా నగరానికి చెందిన ప్రముఖ గజల్ గాయని గంకిడి అరుణకీర్తి పతాక రెడ్డికి నిర్వాహకులు సహస్ర కవితా విభూషణ పురస్కారం అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉదయ సాహితీ వేదిక ఉపాధ్యక్షుడు రఘువీర్ పోరెడ్డి, మహిళా కార్యదర్శి మూర్తి శ్రీదేవి, కురిమల్లె సునంద, లింగుట్ల వెంకటేశ్వర్లు, జిల్లా సాహితీ వేత్తలు మెరుగు అనురాధ, ఉదయశ్రీ, ప్రభాకర్, చింతల కమలం, కవులు పాల్గొన్నారు.

అలరించిన పేరిణి నృత్య ప్రదర్శన



కమల్‌చంద్ర భంజ్‌దేవ్ వివాహ మహోత్సవంలో వరంగల్ పేరిణి నృత్య కళాకారులు

- ఛత్తీస్‌గఢ్ జగ్దల్‌పూర్ కాకతీయుల వంశీయుల ఎదుట నృత్య ప్రదర్శన

హనుమకొండ కల్చరల్: ఛత్తీస్‌గఢ్ జగ్దల్‌పూర్‌లోని కాకతీయుల వంశీయులు కమల్‌చంద్ర భంజ్‌దేవ్ వివాహ మహోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. కమల్‌చంద్ర భంజ్‌దేవ్ రాజ్‌మహల్ ప్రాంగణంలో శనివారం రాత్రి రిసెప్షన్ జరిగింది. వేడుకల్లో వరంగల్‌కు చెందిన నటరాజ కళాకృష్ణ నృత్యజ్యోతి అకాడమీ నిర్వాహకులు గజ్జెల రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో శిష్యబృందం ప్రదర్శించిన పేరిణి నృత్యం అలరించింది. ఈ కార్యక్రమంలో విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యాపకురాలు చాతరాజు నవ్యజ, టూర్స్ కార్యదర్శి అరవింద ఆర్య పకిడే, సేవా టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు కుసుమ సూర్యకిరణ్, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

యువరైతు హఠాన్మరణం

ఆత్మకూరు: గుండెపోటుతో యువరైతు మృతిచెందిన సంఘటన అక్కంపేటలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కడుదుల విజేందర్ (33)కు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

శాయంపేట: మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామానికి చెందిన పెంబర్తి సంపత్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సంపత్‌తో 2005–2006లో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.16 వేల ఆర్థికసాయం అందజేసి చేయూతనిచ్చారు.

ఓరుగల్లు డిక్లరేషన్ ప్రకటిస్తున్నా..



సమావేశంలో మాట్లాడుతున్న హర్షవర్ధన్ రెడ్డి

నయీంనగర్: నల్లగొండ, ఖమ్మం – వరంగల్ ఉపాధ్యాయ జేఏసీ ఎమ్మెల్సీ అభ్యర్థి, టీపీఆర్‌టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి.. ఓరుగల్లు డిక్లరేషన్‌ను ప్రకటించారు. హనుమకొండలో ఆదివారం ప్రచారం, బైక్ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్‌జీఓస్ కాలనీలోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లలో డిక్లరేషన్‌లో ప్రకటించిన అంశాలను పరిష్కరించకపోతే భద్రకాళి అమ్మవారి సాక్షిగా రాజీనామా చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు రఘురెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సురేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రవణ్, సత్యనారాయణ, శ్రీనివాసచారి, జనార్దన్‌రెడ్డి, వివేక్, మాలోత్ శ్రీనివాస్, ఇతర సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పద్మాక్షి గుండం'లో వ్యర్థాల తొలగింపు



హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షి దేవాలయం ఎదురుగా ఉన్న పద్మాక్షి గుండంలో పద్మాక్షి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు గుండంలోని వ్యర్థాలను ఆదివారం తొలగించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కనుకుంట్ల రవికుమార్, అంబటి కుమారస్వామి, గిరి రాజయ్య, పాపయ్య, ఆకుల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులను ఒకే కులంగా గుర్తించాలి



మాట్లాడుతున్న ఎర్రోజు భిక్షపతి

హసన్‌పర్తి: విశ్వబ్రాహ్మణులను ఐదు కులాలుగా కాకుండా ఒకే కులంగా గుర్తించాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి కోరారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం హనుమకొండ, వరంగల్ జిల్లాల సమావేశం భీమారంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు విశ్వబ్రాహ్మణుల బతుకులు చితికిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. విశ్వ బ్రాహ్మణుల ఐదు కుల వృత్తులు పూర్తిగా అంతరించిపోయాయని వాపోయారు. విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ ద్వారా రూ.రెండువేల కోట్లు కేటాయించాలని కోరారు. మార్చిలో హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు భిక్షపతి వివరించారు. సమావేశంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కురిమిల్ల రమేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రోజు మణీంధర్‌నాథ్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి భద్రయ్య పాల్గొన్నారు.

జీబీఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న నాయకులు

వరంగల్: సేవాలాల్ 286వ జయంతి వేడుకలను పురస్కరించుకొని గోరు బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం (జీబీఎస్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వరంగల్ ఓసిటీ నుంచి హనుమకొండలోని దీన్‌దయాళ్ నగర్ సేవాలాల్ మహారాజ్ దేవాలయం వరకు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, గోర్ సిక్వాడీ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ కున్సోత్ హత్యానాయక్ జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీలో గోర్ సేన, గోర్ మలావ్ వెల్ఫేర్ సొసైటీ, ఎల్‌హెచ్‌పీఎస్, సేవాలాల్ సేనతో పాటు పలు బంజారా సంఘాలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, ఆర్డీఓ రమేష్ రాథోడ్, గోర్ సేన హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్, సంగెం మాజీ జెడ్పీటీసీ వీరమ్మ, గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నునావత్ రవీందర్, కోశాధికారి గుగులోత్ తిరుపతి, సహాయ కార్యదర్శి గుగులోతు వినేష్, గౌరవ అధ్యక్షుడు సుందర్, ఎంఈఓ రామునాయక్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మెంబర్ హుస్సేన్ నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్, సేవల సేన హనుమకొండ అధ్యక్షుడు కున్సోత్ మురళి, సీఐ కాశీరాం సంపత్, హరిలాల్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూపై వదంతులను నమ్మొద్దు

- బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ



మడికొండలో చికెన్ పంపిణీ చేస్తున్న రావు పద్మ

మడికొండ: బర్డ్ ఫ్లూపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మొద్దని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. పీపీసీఏ ఫౌల్ట్రీ ఆధ్వర్యంలో వెన్‌కబ్ కంపెనీ సహకారంతో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ పటేల్ ఆధ్వర్యంలో మడికొండ చౌరస్తాలో చికెన్, ఎగ్ మేళాను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చికెన్ కూర, కోడి గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ చికెన్ తింటే ఏమీ కాదని అన్నారు. ప్రజల్లో ఉన్నభయాన్ని పోగొట్టడానికే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు వెన్‌కబ్ సంస్థ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వెంకటేశం, మార్కెటింగ్ మేనేజర్ కనకం రాజు, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, కంపెనీ సిబ్బంది రమేష్, రామచంద్రం, వరంగల్ జిల్లా ఫార్మర్స్ ట్రేడర్స్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కాశీ విశ్వేశ్వరాలయంలో కల్యాణం



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

వరంగల్: ఈనెల 22నుంచి 26వ తేదీ వరకు నిర్వహించనున్న మహా శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా వరంగల్ కాశిబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయంలో సోమవారం శివకల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోనె జగదీశ్వర్ తెలిపారు. ఆలయంలో శివలింగం ఆకృతిలో కలశాలను ఏర్పాటు చేసి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వడిచెర్ల సదానందం, గుండేటి కృష్ణమూర్తి, శ్రీరాముల పెద్దన్న, కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, బయ్యస్వామి, దూపం సంపత్, సముద్రాల పరమేశ్వర్, డాక్టర్ మామిడి ఈశ్వరయ్య, బండారి భాస్కర్, మండల శ్రీరాములు, పాశికంటి రమేష్, ఓంకారేశ్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

చావా సినిమాను ఆదరించండి

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ: ఇటీవల విడుదలై సంచలనం సృష్టిస్తున్న చావా సినిమాను ఆదరించాలని ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు కోరారు. హనుమకొండ ఇందిరానగర్‌లోని నాగుర్ల నివాసంలో ఆరె కుల సంక్షేమ సంఘం ముఖ్య నేతల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందూ సామ్రాజ్య స్థాపన కోసం మహారాజు ఛత్రపతి శివాజీ మహారాజ్ కృషి చేశారని గుర్తుచేశారు. ఛత్రపతి శివాజీ చరిత్రను తెలిపే చలన చిత్రాన్ని ప్రతిఒక్కరూ చూసి ఆదరించాలన్నారు. సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, రాష్ట్ర నాయకులు కొడగాని రాంబాబు, ఆరె విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోటె చిరంజీవి పాల్గొన్నారు.

క్రీడల్లో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి



కాశిబుగ్గ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అశోక్

ఖిలా వరంగల్: క్రీడాకారులు తమలోని ప్రతిభాపాటవాలను ప్రదర్శించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించి, ఓరుగల్లు కీర్తిని చాటాలని సామాజికవేత్త మేరుగు అశోక్ పిలుపునిచ్చారు. ఖిలా వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో గ్రీన్ వారియర్స్ క్రికెట్ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్, డాక్టర్ శ్రవణ్, ఇతరుల సహకారంతో మూడురోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు మల్లాల వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకల్లో అశోక్ మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల్లో స్నేహభావం పెంపొందుతుందని అన్నారు. అనంతరం విజేత కాశిబుగ్గ వినయ్ జట్టుకు చాంపియన్‌షిప్ ట్రోఫీ అందజేశారు. కొత్తవాడ టీమ్ ద్వితీయ స్థానంలో నిల్చింది.